కొత్త రేషన్ కార్డులకు సాంకేతిక సమస్యలు

- లబ్ధిదారులను వెంటాడుతున్న సిబ్బంది కొరత
- ఈనెల 31తో ముగియనున్న దరఖాస్తుల చివరి తేదీ



కుర్రే రవీంద్ర

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త రేషన్ కార్డులు, సామాజిక పింఛన్ల దరఖాస్తులు లబ్ధిదారులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు తాడేపల్లి కొత్తూరు హాస్పటల్ వద్ద నివాసం ఉండే కుర్రే రవీంద్ర 5వ సచివాలయానికి ఇటీవల వచ్చారు. ఆయన దరఖాస్తు చేయడానికి వచ్చానని అక్కడి సిబ్బందితో తెలిపారు. కానీ సచివాలయంలో వీఆర్వో లేరని తెలుపడంతో అతను అక్కడే ఉండి తనకు కార్డు నమోదు చేయాలంటూ పట్టుబడ్డాడు. అక్కడి సిబ్బంది ఎలా అయినా నమోదు చేద్దామని ఆన్‌లైన్ చేసేందుకు కంప్యూటర్ ఆన్ చేయగా రవీంద్ర హౌస్ మ్యాపింగ్ జరగలేదని చూపిస్తోంది. అది చేద్దామని సిబ్బంది ఎంత ప్రయత్నించినా డేలా ఎంట్రీ కాకపోవడంతో వారు ఏమీ చేయలేకపోయారు.

తీవ్రతరంగా మ్యాపింగ్ సమస్య..

రవీంద్రకు సింగిల్ పర్సన్ కార్డు కావాలని అధికారులను కోరారు. మొదట అలా ఇవ్వమని చెప్పడంతో అతను కార్డు ఎలా ఇవ్వవచ్చు అనే విషయాన్ని వారికి వివరించారు. అయినా సరే కార్డు దరఖాస్తు చేసుకోవడానికి మా దగ్గర అవకాశం లేదని అతన్ని తిరిగి పంపించారు. ముగ్గురోడ్డులోని ఓ మహిళ తన కార్డులో తమ పిల్లల పేర్లు నమోదు చేసేందుకు సచివాలయంకు వెళ్లారు. తల్లి ఒక చోట మ్యాపింగ్ కాగా, పిల్లలు మరోచోట మ్యాపింగ్ అయ్యారు. దీంతో ఆమె కార్డు కూడా నిలిచిపోయింది. తాడేపల్లి, మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పలు చోట్ల ఈ మ్యాపింగ్ సమస్య తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. ప్రతి సచివాలయంలో మొత్తం 10 మంది సిబ్బంది ఉండాలి. కానీ 5 నుంచి 7 మంది మాత్రమే ఉంటున్నారు. అందులో ఒకరు ఇమ్యూనిటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. దీంతో కొత్త రేషన్ కార్డులు, సంక్షేమ పథకాల నమోదు ప్రక్రియ చాలా ఆలస్యంగా ఉందని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడేపల్లి రూరల్‌లోని సచివాలయం

సిబ్బంది కొరతతో కార్డుల్లో జాప్యం..

తాడేపల్లి పట్టణ, రూరల్‌లో మొత్తం 25 మంది వీఆర్వోలు ఉండాల్సి ఉండగా 17 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీఆర్వోలకు ప్రభుత్వం కేటాయించిన 64 సేవలతో పాటు మరి కొన్ని సేవలు అదనంగా అప్పగించారు. దీంతో తీవ్ర పని ఒత్తిడి వల్ల కార్డుల్లో జాప్యం అవుతున్నట్లు తెలియవచ్చింది. ప్రస్తుతం సచివాలయాల్లో విద్యా శాఖకు సంబంధించిన సిబ్బంది, వెల్ఫేర్ సిబ్బంది కొత్త రేషన్ కార్డులు ఆన్‌లైన్ చేయగా వాటిని వీఆర్వోలు అప్రూవల్ చేస్తున్నారు. ఇలా ఆన్‌లైన్ చేసే సమయంలో హౌస్ మ్యాపింగ్ సమస్యతో పాటు డేటా సబ్మిట్ చేసే సమయంలో సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో పలు సమస్యలు ఏర్పడుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 31వ తేదీతో రేషన్ కార్డుల దరఖాస్తు చివరి సమయం కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పూర్తి అవగాహన లేదు..

ఒక్క వ్యక్తి ఉన్నా కార్డు ఇస్తామని.. రెవిన్యూ శాఖ అధికారులు ధ్రువీకరించి ఆ కార్డును ఆ వ్యక్తికి అందజేస్తామని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కానీ ఇక్కడ సిబ్బందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే విషయంలో పూర్తి అవగాహన లేదు. ముందు సింగిల్ పర్సన్‌కు కార్డు ఇవ్వనన్నారు. ప్రక్రియను వివరించిన తరువాత ఆన్‌లైన్‌లో పలుమార్లు ప్రయత్నించగా అవ్వలేదని తెలిపారు. కొత్త కార్డులు అందజేయడంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తే ఎంతోమంది లబ్ధిదారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నగర పరిధిలోని విద్యా భవన్‌లో డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల ఏకాభిప్రాయం ప్రకారమే విద్యారంగంలో సంస్కరణలు చేశామని ఉన్నతాధికారులు, ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అన్ని సంఘాలు వ్యతిరేకించే అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని మార్పాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూలు అసిస్టెంట్‌లను నియమించడం సరికాదన్నారు. నూతన విధానం అమలవుతున్నందున మూడేళ్ల పాటు రేషనలైజేషన్ ప్రక్రియ లేకుండా చూడాలన్నారు. ఎంఈవోల బదిలీలు జరిపి కోరుకున్న ఎంఈవో 1, ఎంఈవో 2లకు హెచ్‌ఎం కన్వర్షన్ ఇవ్వాలన్నారు. మెరుగైన విద్యావిధానం అందించేందుకు అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యా రంగంలో మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూటీఎఫ్ నాయకుడు వై.హృదయరాజు, ఏపీపీటీఏ నాయకుడు కె.ప్రకాశరావు, ఏపీహెచ్‌ఎంఏ వై.శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ నాయకుడు ఏఎం అంకారావు, ఏపీటీఎఫ్ నాయకురాలు సీహెచ్ మంజుల, ఏపీయూఎస్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎస్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



విద్యా భవన్‌లో డైరెక్టర్‌కు నోటీసు అందజేస్తున్న సంఘాల నాయకులు

జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ

తాడేపల్లి రూరల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అనూష మాట్లాడుతూ.. ఏడీస్ అనే దోమకాటుతో డెంగీ వ్యాధి సోకుతుందని తెలిపారు. ఈ దోమ సాధారణంగా పగటి పూట కుడుతుందని అన్నారు. డెంగ్యూ సోకిన వారికి అధిక జ్వరం, వాంతులు, దద్దుర్లు, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పి, కళ్ల వెనుక నొప్పి, ప్లేట్‌లెట్లు పడిపోయి చిగుళ్లు, ముక్కు నుంచి రక్తం కారుట వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. డెంగ్యూకు గురికాకుండా ఉండడానికి ప్రజలు పరిసరాలు, పరిశుభ్రంగా ఉంచుకోవడం, టైర్లు, కొబ్బరిచిప్పలు, కూలర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవలన్నారు. డెంగీ లక్షణాలు కనబడితే సమీపంలోని హెల్త్ సెంటర్‌లో ప్రభుత్వం అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందితో మలేరియా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గురుకుమార్, యస్‌యూవో సుధీర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: జాతీయ డెంగీ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ, మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ.. ఈ ఏడాది థీమ్ అయిన 'పరిశీలించండి- శుభ్రం చేయండి- మూతలు పెట్టండి' అనే మూడు అంశాలతో ఎ.ఎన్.ఎంలు, ఆశాలు, హెల్త్‌సెంటర్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఏడీస్ అనే పగలుకుట్టే దోమకాటుతో డెంగీ సోకుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి ఉండే లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ వైద్యులు దీపిక, ఆదిత్య, మలేరియా సూపర్‌వైజర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్లు వాసు, నరసింహారావు, ఎ.ఎన్.ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ అనూష

క్లుప్తంగా

దేవుడి మాన్యంలో ప్లాట్లు ఇవ్వండి

తాడేపల్లి రూరల్: రాజధానిలో స్పీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి భూములు ఇవ్వడానికి ఉండవల్లి రైతులకు ఎటువంటి అభ్యంతరం లేదని.. భూములు ఇచ్చిన రైతులకు ఉండవల్లి దేవుడి మాన్యంలో ప్లాట్లు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాజధాని రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి అధ్యక్షతన ఉండవల్లిలో రైతుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో విధించిన రకరకాల జోన్లు ఎత్తివేయాలని, భూములు అన్ని రకాల నిర్మాణాలు చేసుకునే విధంగా భూయజమానులకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్నంగి అంజిరెడ్డి, దండమూడి సాంబశివరావు, కళ్లం అరవిందరెడ్డి, బక్కిరెడ్డి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటి చుట్టు పక్కల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని శ్వేత సూచించారు. మురుగు నీటిపారుదల సరిగా లేకుండా నిలిచిపోతే దానిని తప్పని సరిగా శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగు కుంటల్లో దోమలు నిల్వ ఉంటాయని దాని ద్వారా డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, కిరణ్, బాబురావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ముస్లింపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రంజాన్ పండుగ రోజు విద్యుత్ సరఫరాకు పూర్తిస్థాయిలో ఇబ్బంది ఏర్పడటంతో గుంటూరు-కర్నూలు రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సమస్య పరిష్కరించే దిశలో భాగంగా శుక్రవారం గతంలో ఉన్న 110 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. పనులను ఏఈ దుర్గాప్రసాద్ పరిశీలించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని.. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధులు కల్పిస్తూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ దివస్

దుగ్గిరాల: ప్రతి నెల మూడో శనివారం జరిగే స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఈనెల 'బీట్ ది హీట్' కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గిరాలలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి శుక్రవారం ఆ ప్రకటనను ఆయన విడుదల చేశారు. శనివారం ఉదయం 8.30 గంటలకు అన్ని గ్రామ పంచాయతీలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



మంగళగిరి: మంగళాద్రి ఘాట్ రోడ్డులోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 23వ తేదీ శుక్రవారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల వివరాలను ఆయన వెల్లడించారు. 17న శేషవాహనం, 18న హనుమంత వాహనము, 19న సింహవాహనం సేవలు ఉంటాయని తెలిపారు. 20న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి గజవాహనం సేవ, అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 21న ఉదయం గరుడోత్సవం, రాత్రి రాజాధిరాజ వాహనం, 22న ఉదయం శ్రీవారి వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరావతి ఐకాన్ అపార్ట్‌మెంట్ నందు నిర్వహించిన పిల్లల వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ఘనంగా ముసిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గతనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు జరిగిన పిల్లల వేసవి శిక్షణ శిబిరంలో గణితంలో మెళకువలు, డ్యాన్స్‌లలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకత శక్తి పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు ఆహుతలను ఆకట్టుకున్నాయి. శిక్షణా శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్, అమ్మ కల్యాణ మండపం పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, గణిత మాస్టర్ లెనిన్ బాబు, వేసవి శిక్షణ శిబిరం బాధ్యులు మనోహర్ రెడ్డి, బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఫౌండర్, చైర్మన్ గోపు నాగరాజు, ఓబులా రెడ్డి, డ్యాన్స్ మాస్టర్ చందు, సీహెచ్ శివ రామిరెడ్డి, వై.బర్నబాస్, డి.కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

చలివేంద్రం ప్రారంభం



పెదవడ్లపూడి(మంగళగిరి): మండలంలోని పెదవడ్లపూడి సాయిబాబా ఆలయం వద్ద సాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ట్రస్ట్ కార్యదర్శి ప్రాతూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అన్నే శరత్, చల్లపల్లి కిరణ్, కోటేశ్వరరావు, జువ్వాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ఫిరంగిపురం: బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సునీత అన్నారు. మండలంలోని మేరికపూడిలోని అంగన్‌వాడీ సెంటర్లో కిశోర వికాశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సూపర్ వైజర్ సునీత మాట్లాడుతూ.. వేసవి సెలవల్లో భాగంగా 11 నుంచి 18ఏళ్ల బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించామన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలియజేశారు. రక్తహీనత వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల గురించి ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం వారికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సీతామహాలక్ష్మీ, భారతమ్మ, కృష్ణవేణి, శాంతి, మేరి, ఏఎన్‌ఎం పాపులమ్మ, మహిళా పోలీసు గాయత్రి పాల్గొన్నారు.

సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం

మంగళగిరి టౌన్: సచివాలయ సిబ్బంది సెలవుల్లో ఉండడంతో ప్రజలకు అందవలసిన సేవలు సకాలంలో అందడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మంగళగిరి నగర పరిధిలోని సూర్యనారాయణ నగర్‌లోని 12వ సచివాలయంలో శుక్రవారం సిబ్బంది సెలవులో ఉండడంతో వివిధ సేవల కోసం వచ్చిన ప్రజలు, విద్యార్థులు వెనుదిరిగారు. కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో 10వ తరగతి, ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు తరువాత విద్యాభ్యాసం కోసం అవసరమైన ధృవపత్రాల కోసం సచివాలయాలకు వస్తున్నారు. సిబ్బంది కొన్ని రోజులుగా సెలవులో ఉండడంతో వీరంతా నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు, పలు సేవల కోసం వచ్చే వారు సిబ్బంది లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా ఉన్న సిబ్బంది సర్వేల నిమిత్తం ఫీల్డ్ వర్క్ చేసుకుని సచివాలయానికి చేరుకుంటున్నారు. 12వ సచివాలయంలో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరి, వార్డు ఎమినిటీ సెక్రటరీ తప్ప శుక్రవారం సచివాలయంలో ఎవరూ కనబడలేదు. దీంతో ఖాళీ కుర్చీలు వచ్చిన వారికి దర్శనమిచ్చాయి.



ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న 12వ సచివాలయం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

మంగళగిరి టౌన్: వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గం వ్యాప్తంగా మండలాలు, గ్రామాలకు వివిధ విభాగాల పార్టీ అధ్యక్షులను, కమిటీలను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.

మంగళగిరి పట్టణ వివిధ విభాగాల అధ్యక్షులు..

యూత్‌వింగ్ విభాగం మాదల గోపీకృష్ణ, మహిళా విభాగం సంకె సునీత, బీసీ సెల్ కుంచాల కృష్ణ కిషోర్, ఎస్సీసెల్ మాతంగి బాబు, ఎస్టీసెల్ జగన్నాథం కల్యాణ్, స్టూడెంట్ వింగ్ కర్రి ప్రదీప్, మైనార్టీ సెల్ షేక్ మాలిక్ బాబు, సోషల్ మీడియా వింగ్ నందిగాం ఆకాష్, డాక్టర్స్ వింగ్ చిలక వెంకటరావులను నియమించారు. మండల వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా.. యూత్ వింగ్ కె.గోపిరెడ్డి, మహిళా విభాగం ఎల్.సత్యవతి, బీసీ సెల్ టి.వేణు, ఎస్సీసెల్ జి.సుభాకర్, ఎస్టీ సెల్ పి.దుర్గా దేవసింగ్ నాయక్, స్టూడెంట్ వింగ్ పి.రమేష్, మైనార్టీ సెల్ షేక్ షఫీ, సోషల్ మీడియా వింగ్ జి.శివప్రసాద్, డాక్టర్స్ వింగ్ మేరుగ నాగేశ్వరరావులను నియమించారు.

గ్రామ, మండల కమిటీల నియామకాలు



మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పట్టణ, మండల, తాడేపల్లి పట్టణ, మండల, దుగ్గిరాల మండల పార్టీ కమిటీలను నియమించారు. మంగళగిరి పట్టణ వైస్ ప్రెసిడెంట్లుగా కలకోటి బోయరాజు, షేక్ మధు, జనరల్ సెక్రటరీలుగా తాడిబోయిన సురేష్, తస్లిమ్‌బాషా బేగ్, లీలా సురేష్, తుమ్మ పద్మ, ట్రెజరర్‌గా నల్లబోతుల లక్ష్మయ్య, సెక్రటరీలుగా రాచకొండ వెంకటేశ్వరరావు, వల్లంశెట్టి విజయ్, తమిదల కోటేశ్వరరావు, బొట్టు రవి, తాడికొండ ప్రకాష్, గుంటి రాజ్యలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వింజుల జేమ్స్, కె.సుబ్బారావు, కారంపూడి గోపి, చిన్ని రామారావు, ఎ.అజయ్, ఎన్.నరసింహారావు, యు.బాలకృష్ణ, టి.కోటేశ్వరరావు, డి.సాంబశివరావు, కె.హరి, జి.పరమేశ్వరరావు (ఫణి), టి.బాలకృష్ణ, షేక్ తాజుద్దీన్, కె.వెంకటేశ్వరరావు, ఎస్.భీమయ్య, టి.నాగమల్లేశ్వరరావు, టి.విజయ్, ఎం.సాంబయ్య, ఎం.వెంకట రణగం, ఎ.శివనాగేశ్వరరావు, బి.దామోదర్, బి.హనుమంతరావు, డి.శ్యామ్ బాబు, కె.సారథి, టి.ప్రేమ్, పఠాన్ బషీర్, ఇ.రవి చంద్ర, ఆర్.కృష్ణ, ఎం.నాగమల్లేశ్వరరావు, షేక్ రషీద్, ఎ.చందులను నియమించారు.

మంగళగిరి మండల వైస్ ప్రెసిడెంట్లుగా బి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎం.రాజారత్నం (బుజ్జి), బి.సాంబిరెడ్డి, షేక్ గౌస్, జనరల్ సెక్రటరీలుగా ఎ.మనీష్‌కుమార్ (చిన్నారి), ఎస్.సద్దామ్ హుస్సేన్, వి.పోలు రాజు, సిహెచ్.థామస్‌కుమార్, బి.శ్రీనివాస్‌రెడ్డి ట్రెజరర్‌గా ఎం.నాగేశ్వరరావు, సెక్రటరీలుగా బి.నరేష్, షేక్ బాజీ సైదా, ఎం.విజయ్‌కుమార్, పి.వెంకటరావు, ఎ.నాగేశ్వరరావు, ఎ.శంకర్, జె.నాగరాజు, జి.వెంకటేశ్వర్లు, షేక్ ఆదామ్ షఫీ, కె.లక్ష్మణరావు, బి.శ్రీను నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎ.బుచ్చిరెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, బి. బాలయ్య, పవన్ నాయుడు, కె. ఎలక్షన్ రావు, డి. ఇందిరాదేవి, కె. ప్రేమ్‌కుమార్, లక్ష్మిశెట్టి కిషోర్, ఎం. ముత్యాలరావు, ఆర్ అప్పారావు, టి. వాసు, షేక్ అమీర్ బాష, ఎ. బ్రహ్మంలను నియమించారు.

తాడేపల్లి పట్టణ వైస్ ప్రెసిడెంట్లుగా వి. ఎలీషా, జె. పెద్ద నాగయ్య, జనరల్ సెక్రటరీలుగా ఎం.డి. సర్దార్, చిన్నపోతుల దుర్గారావు, సిహెచ్ స్నేహ సంధ్య, ఎం. మనోహర్, ట్రెజరర్‌గా టి. మహేష్‌రెడ్డి, సెక్రటరీలుగా వి. లక్ష్మీరోజ, ఎ. యాకోబు, ఎం. నాగబాబు, ఆర్ ఎలీషా, కె. వెంకయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి. విజయరావు, వి. శివయ్య, ఇ. అనీల్, డి. శ్రీరామ్ రెడ్డి (గాంధీ), టి. ప్రభాత్ కుమార్, ఎం. రవీంద్ర, కె. మురళి, ఎం. పుష్పరాజ్, పి. నాజర్, ఇ. నాగరాజు, పి. శ్రీధర్, షేక్ సుభాని, బి. రామాంజనేయులు, ఎ. ఉమామహేశ్వరి, వై. పూర్ణ శేఖర్, ఇ. శేఖర్, అమర్, పద్మ, షేక్ హజీ, కె. రామకృష్ణ, షేక్ అన్వర్, పి. రామకృష్ణలను నియమించారు.

తాడేపల్లి మండల హానరబుల్ ప్రెసిడెంట్‌గా పి. కృష్ణమూర్తి వైస్ ప్రెసిడెంట్లుగా కె. పిచ్చిరెడ్డి, వి. కృపారావు, ఎం. దామేశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా పి. విజయ్‌కుమార్, పి. రాంబాబు, కె. శివ నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా బి. సాంబశివరావు, సెక్రటరీలుగా డి. రత్నంరాజు, డి. శివరామకృష్ణ రెడ్డి, ఎం. బ్రహ్మనందరెడ్డి, టి. గౌతమ్ రెడ్డి, ఎస్. దిలీప్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్. పుల్లారావు, జి. ప్రభాకర్ రావు, కె. బుల్లిబాబు, జె. శ్రీనివాసరావు, ఎం. జలీల్, ఎల్. వెంకటేశ్వర్లు, సిహెచ్. శ్రీనివాసరావు, బి. నాగరాజు,ఎం. రాజు, పి. మనోహర్‌లను నియమించారు.

దుగ్గిరాల మండల వైస్ ప్రెసిడెంట్లుగా ఎం. ఆనంద్, ఎన్. కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీలుగా షేక్ సిలారుద్దీన్, వి. రజనీకాంత్, కె. శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా సిహెచ్. రామకోటిరెడ్డి, సెక్రటరీలుగా యు. ఆనంద్‌బాబు, కె. సుధాకర్, యు. ముత్తయ్య, కె. వినయ్, ఎన్. రాజేష్ , ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్. భాస్కర్, జి. సుధాకర్, ఎ. శివాజీ, డి. సురేష్, పి. వెంకటస్వామి, ఎన్. ధనరాజ్, కె. శ్రీను, కె. డేవిడ్ రాజు, సిహెచ్ విజయ్, ఎస్. శివశంకరమూర్తి, డి ఆంజనేయ ప్రసాద్, వి. తిరుపతి రావు, ఎ. రంగారెడ్డి, టి. మోహన్‌దాస్, టి. వెంకట నారాయణ్, కె. చరణ్, కె. నాగరాజు, కె. రవి, టి. బాలాజీలను పార్టీ నియమించింది.

తాడేపల్లి పట్టణ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు..

యూత్ వింగ్ భూపతి కిషోర్, మహిళా విభాగం దర్శి విజయశ్రీ, బీసీ సెల్ కె.రమేష్, ఎస్సీసెల్ సీహెచ్ శ్రీనివాస మధు, ఎస్టీ సెల్ బి.అనీల్, స్టూడెంట్ వింగ్ గోలి నరసింహ, మైనార్టీ సెల్ షేక్ హుస్సేన్, సోషల్ మీడియా వింగ్ టి.వికాస్, డాక్టర్స్ వింగ్ ఎం.కొండయ్యలను నియమించారు. తాడేపల్లి మండల విభాగాలకు.. యూత్ వింగ్ డి.చంద్రశేఖర్ రెడ్డి, మహిళా విభాగం నాగ స్రవంతి, బీసీ సెల్ టి.సత్యనారాయణ, ఎస్సీ సెల్ సంకురు మరియబాబు, ఎస్టీ సెల్ బి.వెంకటేశ్వరరావు, స్టూడెంట్ వింగ్ బి.రాజేష్, మైనార్టీ సెల్ షేక్ మీరాసా, సోషల్ మీడియా వింగ్ జి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్స్ వింగ్ కె.పృథ్వీరాజ్‌లను నియమించారు.

దుగ్గిరాల మండల వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు..

యూత్ వింగ్ ఎ.నాగరాజు, మహిళా విభాగం పి.సంసోనమ్మ, బీసీ సెల్ ఎస్.వెంకటరావు, ఎస్సీసెల్ ఎస్.రత్నం, ఎస్టీ సెల్ జి.రమేష్, స్టూడెంట్ వింగ్ ఎం.గంగ, మైనార్టీ సెల్ షేక్ అబ్దుల్ నజీర్, సోషల్ మీడియా వింగ్ ఎస్.అభిరామ్ నివాస్, డాక్టర్స్ వింగ్ కె.యశ్వంత్‌లను నియమించారు.

యాజమాన్యం మొండి వైఖరిని విడనాడాలి

మంగళగిరి టౌన్: మంగళగిరి ఆర్టీసీ డిపో యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని.. మొండి వైఖరిని విడనాడాలని ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం అన్నారు. మంగళగిరి ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి నాగేశ్వరరావును సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట చేస్తున్న దీక్షలు రెండో రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ.. నాగేశ్వరరావును యాజమాన్యం ఏకపక్షంగా సస్పెండ్ చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి విచారణ లేకుండా జరిగిన పరిస్థితులపై నిజ నిర్ధారణ లేకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని అన్నారు. వెంటనే డిపో మేనేజర్ నిరంకుశ వైఖరిని విడనాడి నాగేశ్వరరావును విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, మంగళగిరి డిపో అధ్యక్షులు సాంబశివరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు షేక్ జిలాని, శ్రీదేవి, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుల స్వీకరణ

తాడికొండ: రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరు సీఆర్డీయే కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. కౌలు నగదు చెల్లింపు, ఎన్-13 రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, వారసులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, గ్రామకంఠం సమస్యతో పాటు పలు సమస్యలపై రైతులు అదనపు కమిషనర్‌కు వినతులు సమర్పించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను అధిక శాతం అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని అన్నారు. పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, ఎ.జి.చిన్నికృష్ణ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కేఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.భీమారావు, జీఆర్‌ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్

20న అమరావతిలో మినీ జాబ్ మేళా

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీయే సౌజన్యంతో ఈనెల 20వ తేదీన మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీ సీఆర్డీయే కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరులోని సీఆర్డీయే స్కిల్ హబ్ కేంద్రంలో నిర్వహించనున్న ఈ మినీ జాబ్ మేళాలో ఫ్రెషర్స్‌తో పాటు వృత్తి అనుభవం ఉన్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు. మేళాకు బీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, వరుణ్ మోటార్స్, స్కిల్ క్రాఫ్ట్, వెకెన్ ఇండియా, ఐటీసీ(క్యాప్షన్ సర్వీసెస్ లిమిటెడ్), హ్యాపీ మొబైల్స్, ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్స్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఎలక్ట్రీషియన్‌లు, ప్లంబర్లు, సర్వేయర్లు, ఇంజినీర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ట్రెనర్లు, క్లర్క్‌లు, మెషిన్ ఆపరేటర్ పోస్టులతో పాటు ఆయా కంపెనీలలో ఇతర విభాగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించనున్నామని తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఏదైనా డిగ్రీ చదివిన ఫ్రెషర్స్ అనుభవం ఉన్న అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. వివరాలకు సీఆర్డీయే ఫెసిలిటేటర్‌లు శంకర్ 98484 24207, శ్రీకర్ 99634 25999లను సంప్రదించాలని కోరారు.

బంగారు ఆభరణాలు చోరీ

మంగళగిరి: మండలంలో బేతపూడికి చెందిన మహిళ రూ.6.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరికి గురైనట్లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేతపూడికి చెందిన రాఘవమ్మ పొన్నూరు వెళ్లి వస్తూ మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్‌లో ఆటో ఎక్కారు. తన వద్ద ఉన్న బంగారు ఆభరణాల బ్యాగును ఆటోలో ఉంచి పాత బస్టాండ్ వద్ద గల బేకరీకి వెళ్లి వచ్చారు. అదే ఆటోలో ఇంటికి చేరుకుని బ్యాగు తీసి చూసేటప్పటికి బంగారు ఆభరణాలు లేకపోవడంతో ఆమె రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: ద్విచక్రవాహనం చోరీ ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఆత్మకూరుకు చెందిన జె.వెంకటరత్నం గురువారం రాత్రి ఇంటికి చేరుకుని ఇంటి బయట వాహనాన్ని రోజులాగానే పార్కింగ్ చేశారు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో చోరీ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.